**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

విజయవాడ,
**తేది : 3 సెప్టెంబర్, 2021.**

## మోడీ దేశం ఆస్తులు అమ్ముతున్నట్లే
## గ్రామాల ఆస్తులను అమ్మమనడాన్ని వ్యతిరేకించండి

గ్రామాల్లో ప్రజల ఆస్తులను అమ్మేసే మోడీ ప్రభుత్వ కుట్రను త్రిప్పికొట్టాలని ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ఈ విధానాన్ని తిరస్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది.

ప్రభుత్వ రంగ ఆస్తులను తెగనమ్మడానికి ఉద్దేశించిన మానిటైజేషన్ విధానాన్ని పల్లెసీమల్లోనూ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో ప్రైవేటుకు అప్పచెప్పడానికి అవకాశం ఉన్న ఆస్తులను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది.

గ్రామసభలు తప్పనిసరిగా నిర్వహించాలని, ఆ సభల్లో 12 కీలకాంశాలను చర్చించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఆదేశాలు అందిన తరువాత నిర్వహించే మొట్టమొదటి గ్రామసభలోనే మానిటైజేషన్ ప్రక్రియ గురించి చర్చించాలని పేర్కొంది. ఆస్థిపన్ను, వృత్తిపన్ను, ఉమ్మడి ఆస్తులను లీజుకివ్వడం, సర్వీసు ఛార్జీలు విధించడం వంటి చర్యలపై చర్చ జరిపి నిర్ణయాలు చేయాలని సూచించింది. ఆ తరువాత కూడా ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని పేర్కొంది.

ఇది అమలులోకి వస్తే పచ్చటి పల్లె సీమలు కూడా ప్రైవేటు రక్కసి బారిన పడనున్నాయి. ఇప్పటిదాకా ఉన్న ఊరుమ్మడి ఆస్తులు రానున్న రోజుల్లో కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి వెళ్లనున్నాయి. వీటన్నింటికి మించి పంచాయతీలకు నిధులు కేటాయించే రాజ్యాంగ బద్ధ బాధ్యత నుండి కేంద్రం తప్పుకునే పెను ప్రమాదమూ ఉంది. పంచాయతీలు స్వావలంబన సాధించాలనే సాకుతో మానిటైజేషన్‌ను అమలు చేయాలని కేంద్రం రాష్ట్రాలకు పంపిన ఆదేశాల్లో పేర్కొంది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మానిటైజేషన్ విధానాన్ని ప్రకటించడానికి ముందే ఆగస్టు 16వ తేదిన ఈ మేరకు కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు అందాయి. అక్టోబర్ నెల నుండి దేశవ్యాప్తంగా ఆ విధానం పెద్ద ఎత్తున అమలు కానుందని, ఆ సమయానికి పంచాయతీలను కూడా సిద్ధం చేయాలని సూచించింది.

నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ విధానంలో భాగంగా మన రాష్ట్రంలో తిరుపతి, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం రైల్వే స్టేషన్లు కూడా మోడీ ప్రభుత్వం భాగం చేసింది.

కనుక నేషనల్ మానిటైజేషన్‌తోపాటు గ్రామాల్లో ప్రజల ఆస్తులు మానిటైజేషన్ చేయాలనే మోడీ ప్రభుత్వ విధానాన్ని తిరస్కరించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి